క్లుప్తంగా

3వ విడతలో 1416 మంది డబుల్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక


లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: జీహెచ్‌ఎంసీ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మూడవ విడత కేటాయింపు బుధవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, మహమూద్ అలీ, కలెక్టర్ అనుదీప్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, ఎమ్మెల్యేల సమక్షంలో నిర్వహించినట్లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మూడో విడతలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్ల నుంచి అర్హులైన 1416 మందిని లాటరీ పద్ధతిలో లబ్ధిదారులుగా ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. త్వరలో వారికి కలెక్టరేట్ నుంచి సమాచారం ఇస్తారన్నారు.

లారీ అపహరణ

హయత్‌నగర్: పార్కింగ్ చేసిన లారీ అపహరణకు గురైన ఘటన బుధవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. కుంట్లూర్‌కు చెందిన అనగంటి నర్సింహకు 12 టైర్ల లారీ ఉంది. మంగళవారం రాజమండ్రి నుంచి ప్లైవుడ్ లోడ్ తీసుకొచ్చి శామీర్‌పేటలో అన్‌లోడ్ చేశాడు. హయత్‌నగర్ సమీపంలోని లక్ష్మారెడ్డి పాలెం వద్ద లారీని పార్కు చేసిన డ్రైవర్ మల్లేష్ పక్కనే ఓనర్ నర్సింహతో మాట్లాడుతున్నాడు. ఇద్దరూ మాట్లాడుకుంటుండగా స్కూటీపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు లారీని గుట్టు చప్పుడు కాకుండా తీసుకెళ్లారు. సమీపంలో ఉన్న ఓ వ్యక్తి ఈ విషయాన్ని గమనించి నర్సింహకు తెలిపాడు. అయన డ్రైవర్‌తో కలిసి తన కారులో వెంబడించినా లారీ ఆచూకీ తెలియరాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

1న హెలెన్ కెల్లర్ విగ్రహావిష్కరణ

చాదర్‌ఘాట్: అక్టోబర్ 1న మలక్‌పేటలోని వికలాంగుల జాతీయ పార్కులో హెలెన్ కెల్లర్ విగ్రహావిష్కర చేస్తున్నట్లు రాష్ట్ర వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ కార్యాలయం అధికారులు బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరవుతారని అన్నారు. సీనియర్ సిటిజెన్ డేను విజయవంతం చేయండి అక్టోబర్ 1న జరిగే అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర వయోవృద్ధుల సంక్షేమశాఖ డైరెక్టర్ శైలజ కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కొప్పుల ఈశ్వర్, మహమూద్ అలీ హాజరవుతారని ఆమె చెప్పారు. అలాగే, అదే రోజు మలక్‌పేటలోని వికలాంగుల కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన బధిరుల ఆశ్రమ పాఠశాల భవనాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభిస్తారని డైరెక్టర్ వెల్లడించారు.

ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులు


శ్రీనివాస్ దంపతులను సన్మానం చేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులు అని కొత్తపేట డివిజన కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. కొత్తపేట డివిజన్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు వేరే పాఠశాలకు బదిలీ అయిన సందర్భంగా పాఠశాలలో బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ దంపతులను ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాశ్ గౌడ్, కొత్తపేట, మోహన్‌నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మారావు, ఆంజనేయులు, ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకోవాలి


సీఐ జలేంధర్‌రెడ్డి

హస్తినాపురం: గణేశ్ నవరాత్రి నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రజలు తమ పూర్తి సహకారం అందించాలని వనస్థలిపురం సీఐ జలేంధర్ రెడ్డి కోరారు. ప్రజల సహకారంతో నిమజ్జన వేడుకలను శాంతియుతంగా, ప్రశాంత వాతారణంలో పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిమజ్జన వేడుకల సందర్భంగా ఈనెల 28 ఉదయం 6 గంటల నుంచి 29 సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు , బార్లు మూసివేయాలని, ఇందులో ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ జలేంధర్‌రెడ్డి హెచ్చరించారు.


సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన క్రేన్, హైమాస్ట్ లైట్లు


సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై నిమజ్జన దృశ్యం


సరూర్‌నగర్ చెరువు వద్ద బందోబస్తుపై ఆరా తీసున్న డీసీపీ సాయిశ్రీ

గణేశ్ నిమజ్జనానికి సర్వం సిద్ధం

- సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్ వద్ద పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికారులు
- అందుబాటులో 8 క్రేన్లు
- 500 మంది పోలీసులతో బందోబస్తు
- 60 సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

చైతన్యపురి: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం జరగబోయే నిమజ్జన కార్యక్రమానికి సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్ సిద్ధమైంది. పోలీస్, జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ, వాటర్ వర్క్స్ శాఖల అధికారుల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. విగ్రహాల నిమజ్జనానికి 8 క్రేన్లు అందుబాటులో ఉంచుతున్నామని అధికారులు తెలిపారు. తాత్కాలిక టవర్లు ఏర్పాటు చేసి లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. నిమజ్జనం సమయంలో చెరువు నీటిలోని చెత్తను, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది అందుబాటులో ఉంచుతున్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. నిమజ్జనాన్ని తిలకించటానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

500 మంది సిబ్బందితో బందోబస్తు

సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జనానికి సుమారు 500 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. నిమజ్జనం కోసం వచ్చే వాహనాలకు 'వన్ ఎంట్రీ వన్ ఎగ్జిట్' పద్ధతిలో రాకపోకలకు అనుమతిస్తామన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 60 సీసీ కెమెరాలతో నిమజ్జన కార్యక్రమాన్ని సమీక్షిస్తామన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, రెండు బోట్లు, స్విమ్మర్లు అందుబాటులో ఉంటారన్నారు. ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉండేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు.

ఇప్పటి వరకు 1700 విగ్రహాల నిమజ్జనం

ఇప్పటి వరకు 8 రోజులలో సుమారు 1720 విగ్రహాలు (మూడు అడుగుల పైన) నిమజ్జనం అయినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం మరో రెండు వేల విగ్రహాలు నిమజ్జనానికి తరలివస్తాయని భావిస్తున్నారు.


వాహనాల పార్కింగ్ స్థలాలు...

- వీఎంహోం, జ్యోతిక్లబ్, సరూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల, సరూర్‌నగర్ జూనియర్ కళాశాల మరియు సరూర్‌నగర్ కట్ట క్రిందిబాగంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చే శారు.
- ఎలక్ట్రానిక్ మీడియా ఓబీ వ్యాన్లు ఇందిరా ప్రియదర్శిని పార్కు ముందు పెట్టుకోవాలి.

సరూర్‌నగర్ ట్యాంక్‌ను సందర్శించిన డీసీపీ

చైతన్యపురి: ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ బుధవారం రాత్రి జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్‌ను సందర్శించారు. నిమజ్జన ఏర్పాట్లు, బందోబస్తు గురించి అధికారులను అడిగి తెసుకున్నారు. ఎల్‌బీనగర్ పరిధిలోని సరూర్‌నగర్ చెరువు, నాగోలు, మన్సూరాబాద్ నిమజ్జన కొలనుల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని డీసీపీ తెలిపారు.

రూట్ మ్యాప్‌ను పాటించాలి



దిల్‌సుఖ్‌నగర్: ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో ప్రతిష్ఠించిన విగ్రహాలను ఊరేగింపుగా సరూర్‌గర్ చెరువు (మినీ ట్యాంక్ బండ్) వద్దకు ఎలా తీసుకురావాలనేది తెలియజేస్తూ పోలీసులు రూట్ మ్యాప్‌ను విడుదల చేశారు. ఆ మ్యాప్ ప్రకారం...

- మలక్‌పేట, అంబర్‌పేట వైపు నుంచి నిమజ్జనానికి తరలివచ్చే వారు గడ్డిఅన్నారం చౌరస్తా మీదుగా శంకేశ్వరబజార్ నుంచి కట్ట పైకి రావాలి.
- బీఎన్‌రెడ్డి, హస్తినాపురం, వనస్థలిపురం, ఎల్‌బీనగర్ చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్ నుంచి వచ్చే వాహనాలు రాజీవ్‌చౌక్ మీదుగా గడ్డిఅన్నారం చౌరస్తా మీదుగా కట్ట పైకి చేరుకోవాలి.
- చంపాపేట, సైదాబాద్, సంతోష్‌నగర్ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు శంకేశ్వర బజార్ మీదుగా రావాలని సూచించారు.

పోటా పోటీగా లడ్డూల వేలం

ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలోని మండపాల వద్ద వినాయక లడ్డూ వేలం పాటలు జోరుగా సాగుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన గణేశ్ లడ్డూ వేలం పాటలో స్థానికులు పలువురు పాల్గొని పోటా పోటీ వేలం పాటలో పాల్గొని లడ్డూలను సొంతం చేసుకున్నారు.

– ఎల్‌బీ నగర్, మలక్‌పేట జోన్ బృందం


వనస్థలిపురంలోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో గణేశ్ లడ్డూను రూ. 3.30 లక్షలకు దక్కించుకున్న దీపా, మల్లారెడ్డి దంపతులు


చైతన్యపురి డివిజన్‌లోని హనుమాన్‌నగర్ కాలనీలో యూత్ అసోసియేషన్ మండపంలోని లడ్డూను రూ. 2.15 లక్షలకు దక్కించుకున్న శతాబ్ది టౌన్ షిప్ నరేందర్ అండ్ టీం


ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీ గణనాథుని లడ్డూను రూ.2.43 లక్షలకు సొంత చేసుకున్న తెలంగాణ ఎలక్ట్రిసిటీ ప్రాజెక్ట్స్ ఫైనాన్స్ డైరెక్టర్ రేఖ శ్రీనివాస్


ఎఫ్‌సీఐ కాలనీలో గణపతి లడ్డూను రూ. 2.47 లక్షలకు దక్కించుకున్న పకీర్ లావణ్య, దేవేందర్‌రెడ్డి దంపతులు

రేపు కామినేనిలో ఉచితంగా గుండె పరీక్షలు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కామినేని ఆసుపత్రి వైద్యులు

మన్సూరాబాద్: సమాజ ఆరోగ్యం, ,శ్రేయస్సు కోసం కామినేని ఆసుపత్రి కట్టుబడి ఉందని ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ అధికారి డాక్టర్ గాయత్రి కామినేని అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఈనెల 29న నిర్వహించే ఉచిత గుండె పరీక్షల శిబిరం పోస్టర్‌ను ఆమె బుధవారం ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆసుపత్రిలో ఆవిష్కరించారు. ఉచితంగా గుండె పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి ఈసీజీ, 2డీ ఎకో తోపాటు కార్డియాలజిస్ట్ కన్సల్టేషన్ ఉచితంగా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సాగర్ భూయార్, డాక్టర్ శశిధర్, డాక్టర్. ఎ.రవికాంత్, డాక్టర్ ఎంఆర్‌ఎం బాబు, డాక్టర్ రాజేశ్‌దేశ్ ముఖ్, తదితరులు పాల్గొన్నారు.

ఒక జిల్లాకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి: దేప


ఆర్‌కేపురంలో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి తదితరులు


లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నల్లా రఘుమారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: 1969 లో తెలంగాణ కోసం మంత్రి పదవిని వదులుకొని, స్వరాష్ట్రం కోసం పరితపించిన తొలితరం ఉద్యమకారుడు, రాజకీయాలకు వన్నెతెచ్చిన మహానుభావుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం రామకృష్ణాపురం డివిజన్ టెలిఫోన్ కాలనీ చౌరస్తాలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతిని డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దేప భాస్కర్ రెడ్డి లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలోని ఒక జిల్లాకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి ఆయన డిమాండ్ చేశారు. యువజన నాయకుడు చిలక ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, యువజన నాయకుడుతల్లాటి రమేష్ నేత, పున్న రమేశ్, బొడ్డుపల్లి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్‌లో...

చంపాపేట: కర్మన్‌ఘాట్ ప్రాథమిక పాఠశాలలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి హాజరై లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుంకోజు కృష్ణమాచారి, సత్యప్రకాష్, అంజిరెడ్డి, తిరుమలేష్, ఉమామహేష్, జంగయ్య, జగదీష్‌గౌడ్, రవిముదిరాజ్, రాజు, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

టెట్‌లో పారిశుద్ధ్య కార్మికుడి ఉత్తీర్ణత


పారిశుద్ధ్య పని చేస్తున్న రమేష్

హయత్‌నగర్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో ఓ పారిశుద్ధ్య కార్మికుడు ఉత్తీర్ణత సాధించాడు. హయత్‌నగర్‌కు చెందిన బోడ రమేష్ తల్లి పారిశుద్ధ కార్మికురాలిగా పని చేసేది. తల్లికి పక్షవాతం రావడంతో ఆమె స్థానంలో రెండేళ్లుగా రమేష్ విధులు నిర్వహిస్తున్నాడు. బీఏ, బీఈడీ ఎంఏ పూర్తి చేసిన రమేష్ పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తూనే టెట్‌కు సిద్ధమయ్యాడు. కాగా, బుధవారం విడుదలైన ఫలితాల్లో అతను అర్హత సాధించి అందరితో శభాష్ అనిపించుకున్నాడు. టెట్ మొదటి పేపర్‌లో 68, 2వ పేపర్‌లో 76 మార్కులు వచ్చాయని రమేష్ తెలిపారు.

పీవీటీ మార్కెట్ ముందు భారీగా స్వాగత ఏర్పాట్లు

దిల్‌సుఖ్‌నగర్: వివిధ ప్రాంతాల్లోని గణేశ్ మండపాల నుంచి గురువారం నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులకు కొత్తపేట గణేశ్ నిమజ్జన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పీవీటీ మార్కెట్ ముందు భారీగా స్వాగత ఏర్పాట్లు చేశామని నిమజ్జన ఉత్సవ కమిటీ చైర్మన్ చిలుక ఉపేందర్‌రెడ్డి, అధ్యక్షుడు గట్ల రవీంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తులకు ప్రసాదం, తాగునీరు పంపిణీ, సాంస్కృతిక (కోలాటం, పాటలు, మిమిక్రీ) కార్యక్రమాలు భారీ ఎత్తున ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సాయిశ్రీ

నాగోలు: గణేశ్ నిమజ్జనం సందర్భంగా సీసీ కెమెరాలతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ తెలిపారు. బుధవారం నాగోలులో పీఎంఆర్ గార్డెన్‌లో ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని పోలీసులు అధికారులు, సిబ్బందితో బందోబస్తుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ బందోబస్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్‌తో పాటు నాగోలు చెరువు, మాన్సురాబాద్ చెరువు, హయత్‌నగర్ పరిధిలో వివిధ చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాటు చేశామని డీసీపీ తెలిపారు. ఈ సందర్భంగా బందోబస్తులో ప్లాటూన్ల స్పెషల్ ఫోర్స్, ఆర్‌ఏఎఫ్ ఫోర్స్, డాగ్ స్క్వాడ్, యాంటీ చైన్ స్నాచింగ్ టీమ్స్, షీ టీమ్స్‌తో పాటు డ్రోన్ టీమ్‌లు బందోబస్తు నిర్వహిస్తాయన్నారు. సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా ఉంటుందని తెలిపారు. ఎల్‌బీనగర్‌లో సీపీ క్యాంప్ కార్యాలయంలోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ల నుంచి నిమజ్జనాన్ని సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తామన్నారు. పోలీసులు తెలిపిన నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిమజ్జనాన్ని అందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీసీపీ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.


శంకేశ్వరబజార్‌లో... మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి


ఐఎస్‌సదన్‌లోని మండపంలో.. కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా !


మూసారంబాగ్ చౌరస్తాలో.. బీజేపీ నేత గౌర విజయ్‌కాంత్, భరత్, సురేష్ తదితరులు


నిమజ్జనానికి వినాయకుడిని తరలిస్తున్న చిన్నారులు

వినాయక నవరాత్రి ఉత్సవాలు ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలో వైభవంగా జరుగుతున్నాయి. గణనాథుడిని మండపంలో ప్రతిష్ఠించి, రోజుకొక నైవేద్యం సమర్పించి విశేష పూజలు చేసిన భక్తులు.. ఉత్సవాలు ముగింపు దశకు చేరడంతో నిమజ్జనం చేసేందుకు గంగమ్మ ఒడికి తరలిస్తున్నారు. ఈ సందర్భంగా పలు మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేసి, లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. మండపాలను స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు తదితరులు సందర్శించి వినాయకుడికి విశేష పూజలు చేశారు.


గౌడ సంఘం గణపతి వద్ద.. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్, బీజేపీ నేత మధుసూదన్‌రెడ్డి తదితరులు


వనస్థలిపురం రెడ్‌ట్యాంక్ సమీపంలో అభిమన్యు యూత్ అసోసియేషన్ కొబ్బరి కుడకల గణేశుని వద్ద భక్తుల పూజలు


కొత్తపేట వాసవి కన్యకాపరమేశ్వరి గుడిలో పూజలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా


నాగోలు మండపంలో.. మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్‌ను సత్కరిస్తున్న మాజీ సర్పంచ్ మైసయ్య తదితరులు


గడ్డిఅన్నారంలో.. బీఆర్‌ఎస్ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి, నాయకులు


పసుమాముల గాయత్రి హిల్స్‌లో నిమజ్జనానికి సిద్ధమవుతున్న కాలనీవాసులు

'సాధన దీక్ష'కు పెద్ద సంఖ్యలో తరలి రండి

మలక్‌పేట: తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో తలపెట్టిన 'ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధనదీక్ష' కు ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మహాసభ సౌత్ ఇండియా అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ కోరారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యుల కోసం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు 10 జిల్లాలోని మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు వినతిపత్రం అందజేశామన్నారు. దే విషయాన్ని బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని గుర్తు చేశారు. ఈ అంశాన్ని పలు సందర్భాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో ఈనెల 30న ఇందిర పార్కు వద్ద కార్పొరేషన్ సాధనదీక్ష చేపట్టాలని నిర్ణయించామన్నారు. పార్టీలకు అతీతంగా వేలాదిగా ఆర్యవైశ్యులు విచ్చేసి దీక్షను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఆర్, గణేష్‌గుప్తా, చింతల రవికుమార్, ఆర్థం లక్ష్మయ్య, కిరణ్‌కుమార్, టి. వెంకటేశం, ఉపేందర్‌గుప్తా, జిల్లా, మండల, గ్రామ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ